క్లుప్తంగా

శనీశ్వరుడికి తైలాభిషేకం



ప్రత్యేక అలంకరణలో శనీశ్వరుడు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని శనీశ్వరస్వామికి శనివారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి నువ్వులు, మంచి నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని పుష్పాలతో విశేషంగా అలంకరించారు. విశేష పూజలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఆరోగ్యంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో శనివారం స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో మెగా క్యాంపు నిర్వహించారు. వైద్యులు గర్భిణులకు వైద్య పరీక్షలు, మహిళలకు క్యాన్సర్, రక్తహీనత స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన, రక్తదాన శిబిరం నిర్వహించారు. మెడికల్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్ మణి, వైద్యులు విజయలక్ష్మి, శ్రీదేవి, మునిశ్రావణి, నర్సింగ్ సూపరింటెండెంట్ రత్నకుమారి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు రమేష్, వినయ్, సుమతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్యూఆర్ కోడ్ బుక్ పోస్టర్ విడుదల

శ్రీకాళహస్తి: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం రాష్ట్రంలో అన్యాయానికి గురైన పార్టీ కార్యకర్తలు కోసం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించిన క్యూఆర్ కోడ్ బుక్ పోస్టర్‌ను మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆవిష్కరిస్తున్నట్లు పార్టీ కార్యాలయం తెలిపింది. కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొనాలని కోరారు.

ఎన్వీ రమణకు సత్కారం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ దర్శనానికి శనివారం విచ్చేసిన సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణను ఎంజీఎం సంస్థల చైర్మన్ గుడ్లూరు మల్లికార్జుననాయుడు, డైరెక్టర్ మయూర్ సత్కరించారు. మయూర్ మాట్లాడుతూ తమ విద్యాసంస్థలో త్వరలో సీబీఎస్‌ఈ స్కూల్‌ను ప్రారంభించనున్నట్లు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఎన్వీ రమణ దంపతులు మాట్లాడుతూ మరోసారి వచ్చినపుడు ఎంజీఎం విద్యాసంస్థలను సందర్శిస్తామని తెలిపారు.

లుంగీ కార్మికుల బతుకు దుర్భరం

- వృత్తిని వదులుకుంటున్న నేత కార్మికులు
- కార్మికులకు గిట్టుబాటు కాని కూలి
- కుంటుపడుతున్న చేనేత కుటీర పరిశ్రమ



మగ్గంలో లుంగీ నేస్తున్న నేత కార్మికుడు, (ఇన్‌సెట్) రాట్నంలో పడుగు తోడుతున్న మహిళ

సత్యవేడు: చేనేత నైపుణ్యంతో నాడు రాజులను సైతం మెప్పించి ఆభరణాలు బహుమతులుగా పొందిన నేత కార్మికులు నేడు పూట గడవని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. నేత కార్మికులు కుటుంబం రోజంతా శ్రమించినా రూ.300 కూలి గిట్టకపోవడంతో కుటుంబ పోషణ భారమై నేడు ఇతర పనులకు వెళ్లేందుకు సిద్ధం కావడంతో చేనేత కుటీర పరిశ్రమ కుంటుపడుతోంది. 20 ఏళ్లకు మునుపు మండలంలో సుమారు 2 వేల కుటుంబాలకు పైగా నేత కార్మికులు ఉండేవారు. ప్రస్తుతం 500 కుటుంబాలకు లోపే నేత కార్మికులు చేనేత పనిలో ఉంటున్నారు.

లుంగీలకు గిరాకీ

మార్కెట్‌లో నేత కార్మికులు తయారు చేస్తున్న లుంగీలకు మంచి గిరాకీ ఉంది. కానీ ఆ లుంగీలు తయారు చేస్తున్న నేత కార్మికులకు మాత్రం స్వల్పంగా కూలి ఉండడంతో రేయింబవళ్లు రెక్కాడితే గానీ కడుపు నిండని బతుకులుగా జీవనం గడుపుతున్నారు. మండలంలోని మదనంబేడు పంచాయతీలో లుంగీలు నేస్తున్న కుటుంబాలు 25 వరకు ఉన్నాయి. గతంలో ఒక్క మదనంబేడులోనే 200కు పైగా చేనేత కుటుంబాలు లుంగీలు తయారు చేసేవారు ఉండేవారు. లుంగీ తయారీ నేతకు కావాల్సిన ముడి సరుకులైన పడుగు, పేక మునుపు తక్కువ ధరలో మార్కెట్‌లో లభించేది. అప్పుడు సొంతంగా కార్మికులు పడుగు పేక కొని లుంగీలు తయారు చేసి వ్యాపారులకు విక్రయించేవారు, తద్వారా లాభాలు గడించే వారు. నేడు వస్త్రాల తయారీకి అవసరమైన పడుగు, పేక ధరలు ఆకాశాన్ని అంటుతుండడంతో కార్మికులు సొంతంగా వీటిని కొనలేక మాస్టర్ వీవర్స్, ధనవంతులైన యజమానుల వద్ద తయారీకి ముడి సరుకు తీసుకొని తక్కువ కూలీతో నేడు లుంగీలు నేస్తున్నారు. కుటుంబంలో భార్య, భర్త కలసి పని చేస్తే కానీ నేత పని జరగదు. రోజంతా కుటుంబీకులు కలసి పనిచేస్తే రూ.400 నుంచి రూ.500 కూడా గిట్టడం లేదు. నేడు నేతన్నలు కుటుంబ భారం మోయలేక ఇతర వృత్తులు, పనులపై మొగ్గు చూపుతున్నారు.

కుటుంబమంతా నేత పనిలో...

ఒక వస్త్రం కానీ, ఒక లుంగీ తయారీ చేయాలంటే.. మొదటగా మహిళలు పేక నూలును రాట్నంతో వడికి పడుగుగా తయారు చేస్తారు. వాటిని మహిళలే అచ్చులో అతికిస్తారు. మగవారు అల్లుపట్టి నేతకు ఉపయోగిస్తారు. మగ్గంపై నేతకు అవసరమైన నూలును, కండీలుగా వృద్ధులు, పిల్లలు చుడుతారు.. 16 మీటర్ల నేత పనిలో 8 లుంగీలు తయారు చేస్తారు. ఇలా ఇంటిల్లిపాది కలిసి పని చేస్తారు. రోజుకు రెండు లేదా మూడు లుంగీలు నేస్తారు. అయితే వీటికి చెన్నై మార్కెట్‌లో చేనేత లుంగీలకు మంచి గిరాకీ ఉంది. వ్యాపారులు లాభాలు గడిస్తున్నారు. అయితే నేత కార్మికులకు మాత్రం కూలి స్వల్పం. పవర్ లూమ్స్‌లో ఎన్ని లుంగీలు తయారైనా నేటికీ చేనేత లుంగీలకు డిమాండ్ ఉంటోంది.



అచ్చు అతుకుతున్న మహిళా నేత కార్మికులు

పని ఉంది.. కూలి లేదు



లుంగీలు ఎన్నైనా తయారు చేయమని యజమానులు అర్డర్లు ఇస్తున్నారు. అయితే 8 లుంగీలు నేస్తే రూ.700 ఇస్తున్నారు. వారానికి 16 లుంగీలు నేస్తే రూ.1400 వందలు వస్తోంది. రోజుకు రూ.300లోపే కూలీ గిట్టుబాటవుతోంది. కుటుంబం గడవడం కష్టంగా ఉంది.

–బి.సుబ్రమణ్యం, మదనంబేడు

పప్పులు కొనలేకున్నాం



ప్రస్తుత ధరల్లో నేడు కూరగాయలు, పప్పు దినుసులు, నూనెలు కొనే పరిస్థితి లేదు. వారానికి వచ్చే డబ్బులు కూరగాయలు, పప్పుదినుసులకే చాలడంలేదు. కరెంటు బిల్లు కట్టలేని పరిస్థితి నెలకొంటోంది. వారంలో ఎక్కువ రోజులు ఉరగాయతో అన్న తినే పరిస్థితి నెలకొంది.

–మల్లీశ్వరి, నేత కార్మికురాలు, మదనంబేడు

రుణాలు మంజూరు చేయాలి



ప్రభుత్వం నేత కార్మికులకు వడ్డీలేని రుణాలు మంజూరు చేయాలి. చేనేత కార్మికులకు ఉచిత కరెంటు అందించాలి. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో పడుగుపేక అంటుకుపోయి పని జరగడంలేదు. అప్పులు చేయాల్సిన పరిస్థితి. ప్రభుత్వం నేత కార్మికులను ఆదుకోవాలి.

–ఏ.లక్ష్మీపతి, మదనంబేడు

సజ్జలను కలసిన నూకతోటి రాజేష్



సజ్జల రామకృష్ణారెడ్డిని సత్కరిస్తున్న నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సమన్వయకర్త, రాజకీయ వ్యవహారాల కమిటీ కన్వీనర్ సజ్జల రామకృష్ణారెడ్డి పుంగనూరులో జరిగిన పార్టీ కార్యక్రమానికి హాజరై తిరుగు పయనంలో తిరుపతిలోని తాజ్ హోటల్‌కు శనివారం సాయంత్రం రావడంతో ఆయన్ను సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ కలసి శాలువాతో సత్కరించారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోండి



ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని సచివాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ నమోదు సేవలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ మోతి తెలిపారు. ఆమె బుచ్చినాయుడుకండ్రిగ గ్రామంలోని గ్రామ సచివాలయం వద్ద ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాన్ని పరిశీలించారు. గత సంవత్సర కాలంగా ఆధార్ కేంద్రం మూత పడడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఆధార్ కేంద్రం ఏర్పాటుకు చొరవ చూపిన ఎంపీడీఓ మోతిని సర్పంచ్ వెంకటమ్మ, ఉపసర్పంచ్ మునిరాజా అభినందించారు. ఈఓపీఆర్డీ రాజేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మురుగు కాలువలో పూడికతీత





వరదయ్యపాళెం: కాలువలో పూడిక తీస్తున్న పారిశుధ్య కార్మికులు, వ్యర్థాలను కాలువల్లో వేయొద్దని స్థానికులకు అవగాహన కల్పిస్తున్న ఈఓ

సాక్షి ఎఫెక్ట్..

వరదయ్యపాళెం: మండల కేంద్రమైన వరదయ్యపాళెం మేజర్ పంచాయతీ అధ్వాన్నంగా ఉన్న మురుగునీటి కాలువలపై శనివారం సాక్షిలో 'పూడిక తీయరు.. మురుగు కదలదు' అనే కథనం ప్రచురితమైంది. దీనిపై జిల్లా ప్రభుత్వ యంత్రాంగం స్పందించింది. తక్షణమే మురుగునీటి కాలువల్లో పూడికతీత పనులు చేపట్టి మురుగునీరు సాఫీగా వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించడంతో స్థానిక పంచాయతీ ఈఓ బసిరెడ్డి స్పందించారు. శనివారం పంచాయతీకి చెందిన పారిశుధ్య సిబ్బందిని అప్రమత్తం చేసి కాలువలో పూడికతీత పనులను యుద్ధ ప్రాతిపదికన చేయించారు. అంతేకాకుండా పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగింపజేశారు. సాక్షి చొరవతో పంచాయతీ పాలకులు స్పందించడంపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

పందుల పట్టివేత



పందుల పట్టివేతను పర్యవేక్షిస్తున్న ఈఓ

రేణిగుంట: పంచాయతీలో పందుల బెడద అధికంగా ఉండడంతో ఈనెల 23 వ తేదీన సాక్షిలో 'స్వైరవిహారం చేస్తున్న పందులు' కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ అధికారులు శనివారం ప్రత్యేకంగా వాహనాన్ని సిబ్బందిని ఏర్పాటు చేసి పందులను పట్టి బయట ప్రాంతాలకు తరలించారు. ఈ పట్టివేతను పంచాయతీ ఈఓ పర్యవేక్షించారు.

చెత్తకు నిప్పు.. అలుముకున్న పొగ

- ఇబ్బందిపడ్డ స్థానికులు



రైల్వే ట్రాక్ వద్ద అలుముకున్న పొగ

రేణిగుంట: మండల కేంద్రంలోని ఎల్లమ్మ దేవాలయం వెనుక రైల్వే ట్రాక్ పక్కన ఉన్న చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం పరిసరాల్లో వేసిన చెత్తకు శనివారం నిప్పు అంటుకుంది. చెత్త కుప్పలు అధికంగా ఉండడంతో పరిసర ప్రాంతాల్లో దట్టమైన పొగ అలుముకుంది. సీబీఐడీ కాలనీ, బాలాజీ నగర్, గువ్వల కాలనీ, బుగ్గ వీధి, వారపు సంత ప్రాంతాల్లో పొగ వ్యాప్తి చెందింది. రైల్వే ట్రాక్‌పై పొగ రావడంతో రైల్వే అధికారులు అప్రమత్తమై సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పంచాయతీ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తేవడంతో పొగ తగ్గింది. పందులు పట్టేవారు చెత్తకు నిప్పు పెట్టినట్లు పంచాయతీ ఈఓ మాధవి తెలిపారు. వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని అన్నారు.



ఆలయ ఆవరణలో ఉన్న చెప్పులు

చెప్పేవారేరీ..?

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానంలో విచ్చేసిన భక్తులకు సౌకర్యార్థం ఆలయాధికారులు నాలుగు గోపురాల వద్ద చెప్పులు స్టాండ్లను ఏర్పాటు చేయడం సంతోషమే. కానీ విచ్చేసిన భక్తులు ఆలయంలో దర్శనానికి వెళ్లాలని ఉద్దేశంతో చెప్పులను గోపురాల వద్ద కూడా విడిచిపెట్టి వెళుతున్నారు, వారికి ఇక్కడ వదలవద్దు చెప్పులు స్టాండ్‌లో వదిలి వెళ్లాలని చెప్పేవారు లేక పోవడంతో భక్తులు తెలియక కంగారుగా దర్శనానికి చెప్పులు విడిచిపెట్టి వెళుతున్నారు., వారు దర్శనం అనంతరం ఆ చెప్పులు అక్కడ లేకుండా వాటిని బయట నాలుగో గేట్ వద్ద గుట్టలు గుట్టలుగా పడవేయడంతో ప్రతినిత్యం విచ్చేసిన భక్తులు వాటిని ఆ గుట్టలలో వెతుక్కుంటూ చాలా ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు గోపురాల వద్ద చెప్పులు వదలకుండా అక్కడ ఎవరినైనా ఏర్పాటు చేస్తే ప్రతి ఒక్కరు చెప్పులు స్టాండ్ లో వదిలి వెళతారు. చెప్పులు స్టాండ్లు ఖాళీగా ఉన్నా వచ్చిన భక్తులకు తెలియకుండా ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా పర్యవేక్షించి, తగు ఏర్పాట్లు చేయాలని హిందూ ధార్మిక మండలి కన్వీనర్ గరికపాటి రమేష్ బాబు కోరుతున్నారు.

మీనాక్షి.. నమోస్తుతే



వ్యాఘ్రాసుర వధ అవతారంలో ఆలయంలోని జ్ఞానప్రసూనాంబ అమ్మవారు



మీనాక్షిగా అవనాక్షమ్మ







లలిత త్రిపురసుందరిగా దక్షిణకాళికాదేవి, కాత్యాయనిదేవిగా ఏడుగంగమ్మల అమ్మవారు, కైలాసనాథకోనలో త్రిపుర సుందరిగా..

నారాయణవనం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో శుక్రవారం సాయంత్రం సముదాయంలోని టీటీడీ అనుబంధ అవనాక్షమ్మ ఆలయంలో అమ్మవారు మదుర మీనాక్షిగా భక్తులకు ఊంజల్‌సేవలో దర్శనమిచ్చారు. కైలాసనాథకోనలోని కామాక్షాంభిక సమేత కైలాసనాథస్వామి ఆలయంలో అమ్మవారు త్రిపురసుందరిగా అలంకరించుకుని భక్తులకు దర్శనమిచ్చారు. తిరువట్యంలో మూలస్థాన ఎల్లమ్మ అమ్మవారు కాళికాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

సురుటుపల్లిలో..

నాగలాపురం: సురుటుపల్లిలోని సర్వమంగళ సమేత పళ్లికొండేశ్వర స్వామి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు శనివారం మరకదాంబికై అమ్మవారు శ్రీ దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

శ్రీకాళహస్తిలో..

శ్రీకాళహస్తి: శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆరవ రోజు శనివారం పలు ఆలయాల్లో అమ్మవార్లు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని జ్ఞానప్రసూనాంబ అమ్మవారు వ్యాఘ్రాసుర వధ అవతారంలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఇక ఆలయంలో బొమ్మల కొలువులో ఏర్పాటు చేసి అమ్మవారు కాత్యాయనిదేవిగా దర్శనమిచ్చారు. ఇక ఆలయంలో కనకదుర్గమ్మ మహాలక్ష్మి, కనకాచలంపై వెలసిన కనకదుర్గమ్మ ప్రత్యేక అలంకారంలో కొలువుదీరి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. బజారువీధిలోని కన్యకాపరమేశ్వరి ప్రహ్లాద లక్ష్మీనరసింహస్వామి అలంకారంలో, భాస్కరపేటలోని చాముండేశ్వరి దేవి స్కంధమాతగా, ముత్యాలమ్మ, శీతాలాంబ అమ్మవారు ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చారు. వేదాంలోని దక్షిణ కాళికాదేవి లలిత త్రిపురసుందరిగా దర్శనమిచ్చారు.

రేణిగుంటలో..

రేణిగుంట: స్థానిక బిస్మిల్లా నగర్‌లోని రాజరాజేశ్వరిదేవి జ్ఞానపీఠంలోని రాజరాజేశ్వరి దేవాలయంలో దేవి నవరాత్రి ఉత్సవాలు పీఠాధిపతి మూర్తి స్వామి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆరవ రోజు శనివార అమ్మవారు శ్రీ లలిత త్రిపుర సుందరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి ఆలయ ఆవరణలో ప్రత్యేక హోమం నిర్వహించారు. .

ఘనంగా అంకాళ పరమేశ్వరి మహోత్సవం





ప్రత్యేక అలంకరణలో అంకాళమ్మ పరమేశ్వరి, హోమం పూజలో పాల్గొన్న భక్తులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఆర్ అనంతాపురంలో ఉన్న శ్రీ అంకాళమ్మ పరమేశ్వరి అమ్మవారి జాతర మహోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా శ్రీ అంకాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని పూలతో విశేషంగా అలంకరించారు. భక్తులు వేసిన అమ్మవారి ముగ్గులు ఆకట్టుకున్నాయి. అనంతరం గ్రామస్తులు హోమాలు వేసి, ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. గ్రామంలో అమ్మవారు గెరిగల ఊరేగింపు ఘనంగా సాగింది. ఉదయం గ్రామంలోని మహిళలు భక్తిశ్రద్ధలతో పొంగళ్లుపెట్టి, అంబలి తీసుకొచ్చి భక్తులకు పంపిణీ చేశారు. ఆదివారం గ్రామ పొంగళ్లు, అమ్మవారి దిష్టి తీర్చడం, కుంబాలు వేయడం, కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అమ్మవారి కథ ఆకట్టుకుంది. జాతరకు హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.